క్లుప్తంగా

సీఐని అభినందించిన ఎస్పీ



మహబూబాబాద్ రూరల్: ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్ టోర్నీకి ఎంపికైన సీఐ శ్రీనివాసును ఎస్పీ శరత్ చంద్ర పవార్ మంగళవారం అభినందించారు. ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ 2022 క్రీడోత్సవాలకు జిల్లా పోలీస్‌శాఖ పరిధిలో టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాస్ ఎంపికయ్యారు. తెలంగాణ పోలీస్ శాఖ తరఫున ఎంపికై చండీగడ్‌లో ఈనెల 20నుంచి 26 వరకు జరుగనున్న ఆల్ ఇండియా పోలీస్ క్రీడోత్సవాలలో సీఐ పాల్గొననున్నారు.

హోంగార్డ్‌కు ఆత్మీయ వీడ్కోలు

మహబూబాబాద్ రూరల్: పదవీ విరమణ పొందిన హోంగార్డ్ సీహెచ్.సాంబయ్యకి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన వీడ్కోలు సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మంగళవారం సాంబయ్యకి పూల మాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రభుత్వ వాహనంలో లాంఛనంగా ఇంటికి సాగనంపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్య, ఆర్ఐ సురేష్, ఆర్ఎస్ఐ మౌనిక, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా 'భోగ్ బండారో'



మహబూబాబాద్ రూరల్: సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రం శివారులోని అనంతారం సేవాలాల్ ఆలయ ప్రాంగణంలో మంగళవారం భోగ్ బండారో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

డీఎస్పీ పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి వారిని మహబూబాబాద్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రమణబాబు మంగళవారం దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్సై బి.రామునాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

చిన్నగూడూరు: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కురవి మండల కేంద్రంలో ఈనెల 18న జరిగే భద్రకాళి సమేత వీరభద్రుని కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని ఆలయ చైర్మన్ బాదావత్ రాము నాయక్, కురవి మండల నాయకులు ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బజ్జూరి పిచ్చిరెడ్డి, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ రమేష్, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ గుగులోతు రవి, ధర్మకర్తలు ఉన్నారు.

విద్యార్థిని ప్రతిభ



డోర్నకల్: రాష్ట్రస్థాయి స్టోరీ టెల్లింగ్, స్టోరీ విజార్డ్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థిని ప్రతిభ కనబర్చింది. మంగళవారం వరంగల్ నిట్‌లో ఎస్‌సీఈఆర్‌టీ, భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి స్పెల్ విజార్డ్ పోటీల్లో స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఆర్.కృష్ణవేణి పాల్గొని రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి సాధించింది. ప్రిన్సిపాల్ కృష్ణభాను, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి

నెల్లికుదురు: ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రావిరాల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ రాజారాం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాషబోయిన సాయిలు(55) తాగుడుకు బానిసై నిత్యం భార్యతో గొడవ పడుతుండేవాడు. ఇంట్లో ఉన్న బియ్యం బస్తాను నెత్తిమీద పెట్టుకొని వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తాగిన మైకంలో ఉన్న సాయిలు కుటుంబ సభ్యులు ఇంట్లోకి తీసుకెళ్లి పడుకోబెట్టారు. పనులకు వెళ్లిన కుటుంబ సభ్యులు.. ఇంటికి వచ్చి చూసే సరికి సాయిలు చనిపోయి ఉన్నాడని తెలిపారు. మృతుడి కూతురు భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవ పంచనామా నిమిత్తం మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ముగిసిన సదస్సు

మరిపెడ: ఖమ్మం జిల్లాలో మున్సిపాలిటీల అభివృద్ధిపై జరుగుతున్న చివరి రోజు శిక్షణా తరగతులకు మరిపెడ మున్సిపల్ చైర్మన్ గుగులోతు సింధూరరవికుమార్, వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు పరశురాములు, భిక్షం, సుజాతవెంకన్న, రేఖ లలితవెంకటేశ్వర్లు, ప్రగతిశ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

పెద్దవంగర: అమలు కాని హామీలతో సీఎం కేసీఆర్ ప్రజలను మభ్యపెడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదాని సోమయ్య అన్నారు. మంగళవారం మండలంలోని అవుతాపురం గ్రామంలో ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్ ఆధ్వర్యంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ పనికర యాకయ్య అధ్యక్షతన చేపట్టిన ఈ సమావేశంలో సోమయ్య పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్, జిల్లా కార్యదర్శి పరిపాటి రామ్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సాయిని ఝాన్సీ రవి, బూత్ అధ్యక్షులు కోట కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు పోరాడాలి

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా సమస్యల పరిష్కారం కోసం ప్రజలు పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు యాప సీతయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని రామ మందిరం సమీపంలో మంగళవారం ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీతయ్య మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబమే బంగారంగా బతుకుతుందని, బంగారు తెలంగాణలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు ఒద్దిరాజు రాంచందర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సర్పంచ్‌ల ఆత్మహత్యలకు పరోక్షంగా కారణం బీఆర్ఎస్ పార్టీదే అన్నారు. రానున్న ఎన్నికలో కేసీఆర్‌ను గద్దె దించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శ్యాంసుందర్‌శర్మ, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ మోసంగి మురళి, మహిళ నాయకులు ఇందు భారతి, ఓర్సు పద్మ, నాయకులు లక్ష్మణ్‌రావు, సందీప్, సంపత్, శ్రీను, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న సీతయ్య, పక్కన రాంచందర్‌రావు

చరమగీతం పాడాలి

దంతాలపల్లి: రాష్ట్రంలో నడుస్తున్న కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మానుకోట జిల్లా ఇన్‌చార్జ్ కట్టసుధాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని ఆగాపేట, దుబ్బతండా శక్తికేంద్రాలలో మంగళవారం జరిగిన ప్రజాగోస కార్యక్రమంలో మాట్లాడారు. డోర్నకల్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని స్థానిక ఎమ్మెల్యే ఎలాంటి అభివృద్ధి చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో చీకటి మహేష్, చందర్, మురళి, రాణిరెడ్డి, సాయి, తదితరులు పాల్గొన్నారు.



పెద్దవంగర: అవుతాపురంలో మాట్లాడుతున్న సోమయ్య



దంతాలపల్లి: మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

అభివృద్ధిని మరిచిన ప్రజాప్రతినిధులు

కురవి: ప్రజాప్రతినిధులు భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధిని మరచిపోయారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆలయంతోపాటు పరిసరాలు, సత్రాలను సీపీఐ బృందం సభ్యులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇచ్చిన రూ.కోట్ల నిధుల్లో రథశాల, గెస్ట్‌హౌస్ ఇప్పటి వరకు నిర్మించలేదని తెలిపారు. ఆలయ భూములను సర్వే చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎంపీ కవిత, ఎమ్మెల్యే రెడ్యానాయక్, మంత్రి సత్యవతిరాథోడ్‌లు తమ నిధులతో ఎలాంటి పనులు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సారయ్య, అనిల్ పాల్గొన్నారు.



గోశాలను పరిశీలిస్తున్న నాయకులు

హాస్టల్ సమస్య పరిష్కరించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న గిరిజన శాఖ ఏటీ

మహబూబాబాద్ అర్బన్: గిరిజన కళాశాలకు సంబంధించిన వసతి గృహ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థులు ప్రసాద్, రాము డిమాండ్ చేశారు. మానుకోట కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం హాస్టల్ విద్యార్థులు ధర్నా నిర్వహించారు. వెంటనే గిరిజన శాఖ ఏటీడీఓ సత్యవతి, ఏఓ నాగసాగర్ స్పందించి మానుకోట జిల్లా కేంద్రంలోని హస్తినపురంలో ఉన్న హాస్టల్‌ను సందర్శించారు. గదుల కొరత, ఇతర సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు రాకేష్, చిన్న, అభిలాష్, నరేష్, శ్రీను, సురేష్, మల్లేష్, బాబు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో యోగా వేడుకలు



డోర్నకల్: మాట్లాడుతున్న ఉమాగౌరి

డోర్నకల్: వెన్నారం, గొల్లచర్ల, మన్నెగూడెం, ములకలపల్లి, చిలుకోడు, పెరుమాళ్లసంకీస యోగా డే వేడుకలను మంగళవారం నిర్వహించి ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది యోగా సాధన చేశారు. వెన్నారం గ్రామంలో ర్యాలీలో సర్పంచ్ బోయిన వెంకన్నతోపాటు పలువురు సైకిల్ తొక్కుతూ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి మాట్లాడుతూ.. ప్రతీ నెల 14న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

యోగా విధిగా చేయాలి

గార్ల: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గార్లలో వైద్యులు, వైద్యసిబ్బంది హెల్త్‌మేళాలో భాగంగా మంగళవారం యోగా సైక్లోథాన్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ అవినాష్ మాట్లాడుతూ.. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతీరోజు ఉదయం యోగా, సైక్లింగ్, వ్యాయామం విధిగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ఇస్మాయిల్ బేగ్, రాధాకృష్ణ, బుజ్జమ్మ, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

మరిపెడ రూరల్: విద్యార్థి సామర్థ్యాన్ని లెక్క వేయటానికి పదో తరగతి మార్కులు ఎంతో కీలకమని తానంచర్ల ప్రధానోపాధ్యాయుడు పసునూటి జనార్దన్ అన్నారు. మంగళవారం శ్రీబాలాజీ ఎస్టేట్స్, కన్‌స్ట్రక్షన్ ఖమ్మం వారి సహకారంతో మండలంలోని తానంచర్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఇంపాక్ట్ ఫౌండేషన్ మోటివేషన్ స్పీకర్లు పలు అంశాలపై బోధించారు. అనంతరం ఎస్టేట్స్ ఎండీ వత్సవాయి రవి అందించిన పరీక్ష ప్యాడ్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యాదగిరి, మనోహర్, శ్రీను, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

నర్సింహులపేట: మండలంలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఎంపీఓ సోమ్‌లాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. గ్రామాల్లో రానున్న వేసవిలో ఎలాంటి నీటి సమస్య రాకుండా చర్య తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

బోరు మోటారు దొంగల అరెస్ట్

గార్ల: వ్యవసాయ బావి బోరు మోటార్ దొంగిలించిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బానోత్ వెంకన్న మంగళవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం సూర్యాతండాకు చెందిన భూక్యా హరిలాల్ బోరు మోటార్ ఈనెల 7వ తేదీన దొంగలు ఎత్తుకెళ్లినట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై అనుమానితులుగా భావిస్తున్న గార్ల మండలం పూసలతండాకు చెందిన భూక్యా సుధీర్, భూక్యా ఉమేష్, ఇస్లావత్ అశోక్‌లను పీఎస్‌కు పిలిపించి విచారించారు. బోరు మోటారు తామే ఎత్తుకెళ్లినట్లు విచారణలో నేరం ఒప్పుకున్నట్లు ఎస్సై వెల్లడించారు. ఈమేరకు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.



మోటారు దొంగిలించిన నిందితులు

నిబంధనల మేరకు విక్రయించాలి

గార్ల: కలుపు మందును మోతాదుకు మించి వినియోగిస్తే పంటలకు నష్టం వాటిల్లుతుందని మహబూబాబాద్ ఏడీఏ ఎం.లక్ష్మినారాయణ రైతులకు సూచించారు. మంగళవారం గార్లలోని పలు పురుగుమందుల దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. నిబంధనలు పాటిస్తూ విక్రయాలు చేపట్టాలని సూచించారు. ఏడీఏ వెంట ఏఓ కావటి రామారావు, ఏఈఓ పాల్గొన్నారు.

వేతనాల పెంపు

తొర్రూరు: తొర్రూరు డిపోలోని పలు ప్రాంతాలకు నడుపుతున్న హైయిర్ బస్ డ్రైవర్ల వేతనాలు పెంచుకోవడం జరిగినట్లు ఎయిర్‌బస్ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ తొర్రూరు డిపో గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి రవి మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో బస్ యజమానుల రీజనల్ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, రామిరెడ్డి, నాగిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, యూనియన్ అధ్యక్షుడు దేవేందర్ పాల్గొన్నారు.

ఆదర్శ దంపతుల ఆత్మీయ సమ్మేళనం

నెహ్రూసెంటర్: కుల, మతాంతర వివాహాలు చేసుకుని సమాజంలో ఆదర్శంగా జీవించాలని, కుల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ నేతావత్ వెంకన్న అన్నారు. ఆదర్శ దంపతుల ఆత్మీయ సమ్మేళనం జిల్లా కేంద్రంలోని కేవీపీఎస్ సంఘ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈసందర్భంగా వెంకన్ననాయక్ మాట్లాడుతూ.. ఆదర్శ వివాహాలతోనే కులరహిత సమాజం సాధ్యమన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యనమల కిరణ్, దుడ్డెల రామ్మూర్తి, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు చాంగటి ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.



దంపతులను సన్మానిస్తున్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్య



స్టడీ మెటీరియల్ అందజేసిన క్లబ్ ప్రతినిధులు

గూడూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నేడు ఉన్నతమైన విద్యాబోధన జరుగుతుందని, ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ గవర్నర్ రామగిరి రవీందర్, స్టడీ మెటీరియల్ దాత ఆత్మకూరి వాగ్దేవి రాంగోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల హైస్కూల్ 65మంది విద్యార్థులకు సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం.కాంతారావు, క్లబ్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారావు, కుమారస్వామి, రాజయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో కొనసాగుతున్న పూజలు

గార్ల: గార్ల మండలం మద్రిగూడెం వేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో 3వ రోజు మంగళవారం ద్వార పాలకులు జయవిజయులకు జలాధివాసం కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఘనంగా నిర్వహించారు. తొలుత మూల మంత్రం, మూర్తి మంత్రం హోమ కార్యక్రమంను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా బుజ్జి, జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత, రమేష్‌బాబు పాల్గొన్నారు.



జలాధివాసం చేస్తున్న ఎన్నారైలు

బడిలో పేర్లు నమోదు చేయాలి



కిట్లను పంపిణీ చేస్తున్న డీఈఓ

మహబూబాబాద్ అర్బన్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను సమీప ప్రభుత్వ బడిలో పేర్లను నమోదు చేయాలని డీఈఓ పి.రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రత్యేక అవసరాల పిల్లల భవిత కేంద్రానికి మంగళవారం మానసిక దివ్యాంగుల సాధికార సంస్థ హైదరాబాద్ వారి సహకారంతో ఉచితంగా 28 కిట్లను, బోధన పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏడీ వి.రాజేశ్వర్, కోఆర్డినేటర్ ముఖేష్, ప్రతినిధి అంజిరెడ్డి, నిషాంత్, ఐఈఆర్‌పీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఆవుల యుగేందర్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు పరామర్శించారు.

కురవి: మండలంలోని తట్టుపల్లి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఇంటికి వచ్చిన హోంగార్డు మట్ట నరేష్, అదే గ్రామంలో యాకూబ్ అలీ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మంగళవారం పరామర్శించారు.

దంతాలపల్లి: మండలం దొనకొండ గ్రామంలో అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న దొప్పరి శ్రీను, గున్నెపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బయ్య ఉప్పలయ్య కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే రెడ్యానాయక్ పరామర్శించారు.

సంక్షిప్త సమాచారం

చెస్ పోటీలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలిక జూనియర్ కళాశాలలో ఈనెల 16న మహిళల చెస్ పోటీలను నిర్వహిస్తున్నామని అర్హులైన బాలికలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అనిల్ మంగళవారం తెలిపారు. ఆసక్తి గల వారు 62819 54342 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కార్యదర్శిపై విచారణ

దంతాలపల్లి: గ్రామ పంచాయతీకి సంబంధించిన బిల్లులు సొంతంగా వాడుకున్నాడని గ్రామ కార్యదర్శి శ్రీహరిపై మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో తొర్రూరు డివిజన్ పంచాయతీ అధికారి సెర్పుద్దీన్ మంగళవారం విచారణ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అప్సర్‌పాషా, కార్యదర్శి రామస్వామి, పాల్గొన్నారు.

టీబీ నిర్ధారణ పరీక్షలు

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల ప్రజావైద్యశాలలో మంగళవారం టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యురాలు చైతన్య మాట్లాడుతూ.. జబ్బు ఉన్నవారికి ప్రభుత్వం మందులతోపాటు, పౌష్టికాహారం కోసం రూ.500 ఇస్తున్నట్లు తెలిపారు.

ఎస్టీలో కలపొద్దు

బయ్యారం: ఎస్టీలో 11కులాలను కలపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించటం సరికాదని ఆ ఆలోచనను విరమించుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి వర్సా ప్రకాశ్ మంగళవారం తెలిపారు. నాయకులు శ్రావణ్, రమేష్, శ్రీకాంత్, సాయి, రఘువర్మ, సాయిరాం, రామారావు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల అందజేత

కురవి: మండలంలోని కొత్తూరు(జీ) గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తను సేకరించి వాటి ద్వారా కంపోస్టు(సేంద్రియ) ఎరువును తయారు చేసి ప్యాకెట్లను రైతులకు మంగళవారం ఎంపీఓ రఘుపతిరెడ్డి, సర్పంచ్ కట్ల సుమలత కరుణాకర్ రైతులకు విక్రయించారు. కార్యదర్శి మయూరి, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రవిచంద్రకు ఆహ్వానం

మరిపెడ రూరల్: డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామంలో మార్చి 3న తలపెట్టనున్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి జీవధ్వజ, బొడ్రాయి, శ్రీశీతలాపరమేశ్వరి ప్రతిష్ఠ మహోత్స వేడుకలకు హాజరుకావాలని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ యువనాయకుడు డీఎస్ రవిచంద్రకు మంగళవారం నిర్వాహకులు ఆహ్వాన పత్రిక అందజేశారు.

సభను విజయవంతం చేయండి



మరిపెడ: ఇస్లామిక్ జల్సా సభను విజయవంతం చేయాలని మరిపెడ ముస్లిం సోదరులు మదర్సా-యే-ఇస్లామియా రౌజతుల్‌బనాత్(ఎడ్యుకేషనల్ సొసైటీ ఉర్దూ పాఠశాల) ఆధ్వర్యంలో ఇస్లామిక్ బహిరంగ సభ ఈనెల 21వ తేదీన మండల కేంద్రంలోని భార్గవ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది. ఈమేరకు మరిపెడలో మంగళవారం సభ పోస్టర్లు ఆవిష్కరించారు.

లైబ్రరీ కార్నర్ ప్రారంభం

కేసముద్రం: మండలంలోని నర్సింహులగూడెం జీపీలో గల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం లైబ్రరీ కార్నర్‌ను హెచ్ఎం రమేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. హైదరాబాద్‌కి చెందిన కోలాముని దామోదరం అనే వ్యక్తి పలు పుస్తకాలను అందించినట్లు ఆయన తెలిపారు.

జయంతిని జయప్రదం చేయండి

బయ్యారం: మండలకేంద్రంలో బుధవారం నిర్వహించనున్న బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతిని జయప్రదం చేయాలని సేవాలాల్‌సేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య రవినాయక్ బుధవారం పిలుపునిచ్చారు. రవీందర్, మంగీలాల్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

గార్ల: బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం వలన బాలికల్లో అనారోగ్య సమస్యలు దరిచేరవని డాక్టర్ పోరిక జ్యోతి సూచించారు. మంగళవారం గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.గోవిందరావు, హెల్త్ స్టాఫ్ స్వరూప, రాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలుగు, హిందీ బోధన కరువు

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 9, 10వ తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ బోధన కరువైందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మేచరాజుపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు ప్రధాన న్యాయమూర్తికి, రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానానికి లేఖలు రాసి నిరసన తెలిపారు.

జాతీయ స్థాయి కబడ్డీకి ఎంపిక



కురవి: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు నేరడలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల పీఈటీ వసంతాదేవి ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీ జ్యోతి తెలిపారు. మంగళవారం జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పీఈటీ వసంతాదేవిని కురవి హైస్కూల్‌లో అభినందించారు. ఈనెల 17న డెహ్రాడూన్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

సమ్మె విరమణ

కేసముద్రం: కేసముద్రంలో 13రోజులుగా రైస్ మిల్ డ్రైవర్లు చేస్తున్న సమ్మె విరమించినట్లు ఐఎఫ్‌టీయూ నాయకులు శివారపు శ్రీధర్ మంగళవారం తెలిపాడు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



డోర్నకల్: రాబోయే వార్షిక పరీక్షల్లో కస్తూర్బా బాలికలు ఉత్తమ ఫలితాలు సాధించాలని కస్తూర్బా బాలికల పాఠశాల ప్రత్యేక అధికారి ఎస్‌కె.మున్నీ కోరారు. మంగళవారం జరిగిన పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో కస్తూర్బా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల బాలికల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

విగ్రహాల ఊరేగింపు

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనలో భాగంగా మంగళవారం విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట సంజీవరెడ్డి, ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

కాలనీవాసులు, నాయకుల మధ్య గొడవ

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలోని వీహెచ్‌పీఎస్ కాలనీవాసులకు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుల మధ్య గుడిసెల లొల్లి మంగళవారం చోటు చేసుకుంది. దివ్యాంగులు రెండు సంవత్సరాల క్రితం భూపోరాటం చేసి గుడిసెలు వేసుకున్నారని ఎంఆర్‌పీఎస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్య తెలిపారు. ఈవిషయమై సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి హెచ్ లింగ్యాను వివరణ కోరగా పేదల కోసం పార్టీ ఆధ్వర్యంలో 2016 లోనే భూపోరాటం చేసి పేదలకు కేటాయించామన్నారు. కానీ ప్రస్తుతం ఎంఆర్‌పీఎస్ నాయకులు మాత్రం దివ్యాంగుల కోసం ఆ స్థలం కేటాయించామని పేర్కొంటూ గుడిసెలు వేశారని ఆరోపించారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు తమపై కావాలనే ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ ఒక గుడిసెకు ఎవరు నిప్పు పెట్టారో తెలియాల్సి ఉంది. ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకోగా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నట్లు సమాచారం.